www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 02 | జూలై | 2026
పేజీలు : 8

## రామారావు హత్య కేసుపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి

-సిపిఎం జాతీయ నాయకురాలు బృందాకారత్





2లో

### అర్హులైన ప్రతి ఒక్కరూ

# ఓటరు జాబితాలో ఉండాలి



-బిఎల్‌వోలు మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలి
-ఎస్ఐఆర్ ప్రక్రియను తనిఖీ చేసిన అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వరరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బుధవారం కూసుమంచి మండలం జుజ్జులరావు పేట, కొణిజర్ల మండలం తనికెళ్ల, వైరా మండలం కెజి సిరిపురం గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ సరళిని అదనపు సిఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను అదనపు సిఈవో సందర్శించి బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్ల పని తీరును పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ధృవీకరణ ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు సిఈవో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, దోష రహితంగా రూపొందించడమే లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐ ఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి

మిగతా 2లో..

### బోనకల్ కస్తూర్బా గాంధీ

# విద్యాలయంలో ఉద్రిక్తత






-ఎస్ఓ, వంట సిబ్బంది వివాదంతో నిలిచిన వంట
-ఆకలితో అలమటించిన 300 మంది విద్యార్థినులు
-ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

**ప్రజాపక్షం/బోనకల్ :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఇస్లావత్ సక్కుబాయి, పాఠశాల వంట సిబ్బంది మధ్య కొనసాగుతున్న వివాదం బుధవారం తీవ్ర స్థాయికి చేరింది. ఎస్‌వో వ్యవహార శైలికి నిరసనగా వంట సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో పాఠశాలలో వంట పూర్తిగా

మిగతా 2లో..

# నివాస స్థలాలు.. ఇందిరమ్మ ఇండ్ల కోసం సిపిఐ, వామపక్షాలు ఆందోళన

## పేదల ఇండ్లు కూల్చితే ప్రతిఘటిస్తాం






- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- వామపక్షాలు చేపట్టిన కలెక్టరేట్ ధర్నా సక్సెస్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతీ ఇంటికీ పట్టా ప్రతీ కుటుంబానికీ ఇల్లు అనే నినాదంతో లాల్ జెండా పార్టీలు ప్రారంభించిన పోరుబాట లక్ష్యం నెరవేరే వరకు ఆగబోదని, పేదకు గూడు కల్పించేంత వరకు పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ సిపిఎం న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వామపక్షాల నాయకులు కార్యకర్తలు ఇండ్లులేని వేలాది మంది పేదలు భారీ సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివచ్చి నాలుగు గంటలపాటు

మిగతా 2లో..

## వంచిస్తే మూల్యం చెల్లించక తప్పదు




-నివాస స్థలాలు మంజూరు చేయాలి
-సంపన్నులు ఆక్రమిస్తే కన్నెత్తి చూడరా
-కలెక్టరేట్ వద్ద ధర్నాలో బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేదలను వంచిస్తే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హెచ్చరించారు. నివాస స్థలాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పాలకులు పేదల పట్ల కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలను విస్మరించిన కారణంగానే ప్రజలు తిరస్కరించారని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాను అవలంభిస్తుందని ఆరోపించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివాస స్థలాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారి పట్ల కక్ష సాధింపు ధోరణిలో బుల్‌డోజర్లతో కూల్చివేస్తున్నారని తెలిపారు. కనీస మానవత ధృక్పథం

మిగతా 2లో..

# నివాస స్థలాలు.. ఇందిరమ్మ ఇండ్ల కోసం సిపిఐ, వామపక్షాలు ఆందోళన






(మొదటిపేజీ తరువాయి)
ఉధృతంగా ధర్నా కొనసాగించారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ నిరుపేదలకు ఇండ్లు ఇండ్లస్థలాలు మంజూరు చేసే వరకు వామపక్షాల ఆధ్వర్యంలో సాగే ఈ ప్రజా ఉద్యమం ఎంత మాత్రం ఆగదని స్పష్టం చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధి లోని జిఓ నెం 76ను తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేసి అర్హులైన పేదలందరికీ పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అదే విధంగా పాల్వంచ పరిధిలోని జిఓ నెంబర్లు 444,999,817,727,410లో దశాబ్దా కాలంగా ఉన్న స్థలాలను తక్షణమే రెగ్యులర్ చేసి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎం సాయిబాబు మాట్లాడుతూ పేదలు ఎంతోకష్టపడి నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేత చర్యలను తక్షణమే మానుకోవాలని, ప్రభుత్వ నిరంకుశ కూల్చివేతలను పేద ప్రజలంతా ఐఖ్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించి వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే ఇంటినెంబర్లు జారీ చేయాలని తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిప



దికన పూర్తిచేసి లబ్దిదారులకు తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ నాయకులు గౌని నాగేశ్వరరావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకుని పేదకు న్యాయం చేయాలన్నారు. లేదంటే కలెక్టరేట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, వామపక్షపార్టీల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఎస్‌డి సలీమ్, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచంద్రావు, కంచర్ల జమలయ్య, మున్నా లక్ష్మీ కుమారి, వాసిరెడ్డి మురళీ, భూక్యా ధస్రు, రాహుల్, ఫహీమ్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, ఎం సతీష్, కుంజా కృష్ణ, పెద్దబోయిన సతీష్, ప్రభాకర్, భాస్కర్, వీరభద్రం, శివ, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)
లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూల్చిన చోటనే పేదలకు నివాస స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని ఇందిరమ్మ ఇండ్ల మంజూరులోనూ పారదర్శకత లోపించిందన్నారు. పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామని హేమంతరావు హెచ్చరించారు.

### సంపన్నులు ఆక్రమిస్తే కన్నెత్తి చూడరా..

ఖమ్మం నగరంలో ఎన్నెస్పి స్థలాలతో పాటు ప్రభుత్వ భూములను సంపన్నులు ఆక్రమిస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఫిర్యాదులు చేసినా ఆ వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదని హేమంతరావు ప్రశ్నించారు. పేదలు ఆక్రమిస్తే బలవంతంగా, దౌర్జన్యంగా అక్కడి నుంచి తొలగించారని పేదల తొలగింపుకు కారణమైన వ్యక్తులే ఆ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇస్తుంటే కనిపించడం లేదా, లేక సంపన్నులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఖమ్మం ఎన్నెస్పి ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదు. తగు చర్యలు తీసుకోకపోతే పేదలను సమీకరించి అక్రమిస్తా



మని హేమంతరావు హెచ్చరించారు. నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు మాదినేని రమేష్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, మాచర్ల భారతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి , పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు శాఖమూరి శ్రీనివాసరావు, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, శ్రవణ్, చింతల రమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

## రామారావు హత్య కేసుపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి

**ప్రజాపక్షం/ చింతకాని :** సిపిఎం రాష్ట్ర నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు హత్య జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా హంతకులను నేటి వరకు ప్రభుత్వం అరెస్టు చేయలేదని ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలని సిపిఎం జాతీయ నాయకురాలు, మాజీ ఎంపి బృందాకారత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సామినేని రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూస్వాములు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడుతున్న రామారావును కాంగ్రెస్ గుండాలు అతి కిరాతకంగా హత్య చేశారని ఈ హత్య వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలుసన్నారు. ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు రామారావుకు వస్తున్న ప్రజాదరణను చూసి అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ ప్రాంత ఎంఎల్‌ఏ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రాజ్యాంగాన్ని కాపాడాల్సింది పోయి హంతకులకు అండగా నిలుస్తున్నారన్నారు. హోంమంత్రిగా రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పూర్తిగా విఫలం చెందారన్నారు.

ఈ హత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పి హంతకులను అరెస్టు చేసేంత వరకు సిపిఎం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, కేంద్ర కమిటీ సభ్యులు సాయిబాబు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు సోమయ్య, పొన్నం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వర్లు, బండి రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సర్పంచ్ లక్ష్మి , రామారావు సతీమణి సామ్రాజ్యం, కుమారుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఉద్రిక్తత

**(మొదటిపేజీ తరువాయి)** నిలిచిపోయింది. దీనితో ఉదయం విద్యార్థినిలకు అందాల్సిన అల్పాహారం అందక సుమారు 300 మంది విద్యార్థినిలు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. వసతి గృహం లోనే ఉండి చదువుకుంటున్న విద్యార్థినిలకు సకాలంలో ఆహారం అందకపోవడంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పాఠశాల యాజమాన్యం, వంట సిబ్బంది మధ్య నెలకొన్న విభేదాల ప్రభావం నేరుగా విద్యార్థులపై పడడంతో తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినిల సంక్షేమం కంటే అంతర్గత విబేధాలే ప్రాధాన్యంగా మారడం దురదృష్టకరమని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. విద్యార్థినిల భోజన ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండాలి

**(మొదటిపేజీ తరువాయి)** తావులేకుండా ప్రతి అర్హుడిని ఓటరు జాబితాలో నమోదు చేయడంతో పాటు మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిని తప్పని సరిగా సందర్శించి ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని, ఫారాలు నింపడంలో సహకరించాలని అదనపు సిఈవో తెలిపారు. బిఎల్‌వోలు ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ ప్రక్రియను సమయపాలనతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలు, అధికారులు పాల్గొన్నారు.

# కళాశాలలు అటు.. బస్టాండ్ ఇటు..!



### ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు బస్టాండు అటు కళాశాలలో పాఠశాలలో ఇటు కావడంతో బస్టాండ్ వరకే వచ్చి పోతుండటంతో విద్యార్థిని విద్యార్థులు సుమారుగా రెండు కిలోమీటర్లు నడిచిపోవాల్సి వస్తుండడంతో ఉదయం రెండు కిలోమీటర్లు సాయంత్రం రెండు కిలోమీటర్ల నడవాల్సి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల, వాచానాయక్ తండ సుమారు 20 గ్రామాల నుంచి పల్లె పేద, నిరు పేద, మధ్యతరగతి విద్యార్థులు పట్టణంకు వచ్చి కళాశాలలో పాఠశాలలో చదువుకొని వచ్చి వెళ్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కళాశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు 7000 మంది రోజువారిగా పల్లె నుంచి పట్నానికి బస్సులపై వచ్చి పోతుంటారు .ఈ సమయంలో పాఠశాలలో కళాశాలలో ఒకవైపు బస్టాండు మరోవైపు ఉండటంతో రెండు కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ సమయంలో మధిర ఆర్టీసీ డిపో వారు పాత బస్టాండ్ వరకు బస్సు సర్వీసులు ఉదయం సాయంత్రం నడిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు విద్యార్థి సంఘాల వారు ఆర్టీసీ డిపో వారిని కోరుతున్నారు. లేనిచో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని పేర్కొంటున్నారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్ ను వివరణ కోరగా ఆర్టీసీ మధిర డిపో వారిని లెటర్ ద్వారా ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించామని పేర్కొన్నారు.

## వైద్యులు భగవంతునితో సమానం



**ప్రజాపక్షం/కల్లూరుః** వైద్యులు భగవంతునితో సమానం అంటూ కల్లూరు లోని సిహెచ్సి వైద్యశాలలో తోపాటు పల్లెదవ ఖానా కల్లూరు, చెన్నూరు లోని, ప్రాథమికోన్నత వైద్యశాల తోపాటు పల్లెదవకాన చిన్న కోరుకొండిలో డాక్టర్స్ డే సిబ్బంది స్టాఫ్ నర్స్ వారి ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పల్లె దవఖాన మరియు ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రాంతీయ వైద్యశాలలో వైద్యులు రమేష్ ను పల్లె దవఖాన లో నవ్య కాంత్ ను చెన్నూరులో వైద్యులు తబస్సుం చిన్న కోరు కొండి లో వైద్యులు సాకేత్ లను వైద్య సిబ్బంది తోపాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి కార్మికులు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల ప్రజలు వారిని శాలువాలతో పూలతో సత్కరించి వారి సేవలు ఇంకా అనేకమందికి ఎల్లవేళలా ఉపయోగపడాలని దేవుడు భగవంతుడు ఆయురారోగ్యాలతో ఆశీర్వదించాలని పొగిడారు.

# పెన్షనర్లకు వైద్య సేవలు త్వరలో సాకారం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) ద్వారా పెన్షనర్లకు వైద్య సేవలు త్వరలో సాకారం అవుతుందని ఈహెచ్‌సిటి సభ్యులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు తెలిపారు. ఆసుపత్రులు, వివిధ వ్యాధులకు సంబంధించి ప్యాకేజీ నిర్ణయించాల్సి ఉందని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) జిల్లా కార్యాలయం కృషి భవన్‌లో జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సైదులు మాట్లాడుతూ నగదు రహిత వైద్యం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల చిరకాల కోరిక అని అది త్వరలోనే అమల్లోకి వస్తుందన్నారు. దీనిపై అనేక అనుమానాలు, చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. హెల్త్ స్కీం ప్రీమియం గురించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందన్నారు. ఏమైనా అనుమానాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని సైదులు తెలిపారు. ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ అవకతవకలు లేకుండాపెన్షనర్లకు అవసరమైన వైద్యం ఈహెచ్ఎస్ ద్వారా అందేలా చూడాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పెన్షనర్లు, గ్రంథాలయ సంస్థలో పనిచేసిన పెన్షనర్లకు కూడా ఈహెచ్ఎస్‌లో భాగస్వామ్యం చేయాలని కోరారు.



ఫ్యామిలీ, సర్వీస్ పెన్షన్ తీసుకుంటున్న పెన్షనర్లకు భార్యాభర్తల పెన్షనర్లకు ఒక ప్రీమియం మాత్రమే మినహాయించాలన్నారు. ప్రీమియం, మినహాయింపులు, వైద్య చికిత్సల ఖర్చులు పారదర్శకంగా ఉండాలని, ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు పూర్తి స్థాయిలో అనుమతించాలని పరిశ పుల్లయ్య తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కార్యదర్శి తాడి అంజలి, కనపర్తి నాగప్రసాద్, వై. కమల, చిదిరాల వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, హమీద్, సుధాకర్, అబ్దుల్ షరీఫ్ పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన అదనపు సిఈవో

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవిఎం) గోడౌన్‌ను రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలు భద్రపర్చిన గదుల సీళ్లను పరిశీలించారు. గోడౌన్ భద్రతకు సంబంధించిన నమోదు పుస్తకాన్ని తనిఖీ చేసి విధి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించి 24 గంటల పాటు నిఘా వ్యవస్థ సమర్థవంతంగా పని చేసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఫైర్ అలారం వ్యవస్థ, అగ్నిమాపక యంత్రాల పనితీరు, వాటి నిర్వహణ పరిస్థితిని పరిశీలించారు. ఈవిఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని



సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్‌డిసి సదానందం, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ పాల్గొన్నారు.

# మధ్యాహ్నా భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోరుతూ ఖమ్మం జిల్లా మధ్యాహ్నాం భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఖమ్మం జిల్లా విద్యాధికారి, జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి డిఈఓ సదానందంకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్నా భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్నాం భోజన కార్మికుల సమస్యలను జిల్లా ఇన్చార్జి డీఈవో కు వివరించటం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ మధ్యాహ్నా భోజనం పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ప్రభుత్వం గత సంవత్సరం క్రితం పెంచిన మెను చార్జీలు మాత్రమే అమలు చేస్తుందని, తక్షణమే ప్రభుత్వమే వంటకు కావలసిన సరుకులు, కూరగాయలు, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వంట కార్మికులను కార్మికులుగా



గుర్తించి గుర్తింపు కార్డులు అందించాలని, వారికి కనీస వేతనం పరిధిలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్నా భోజన పథకం వర్కర్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు షేక్ రహి మునిస్సా, జిల్లా కమిటీ సభ్యులు వెంకటమ్మ, సాయమ్మ, సత్యవతి, మంగమ్మ, పారేపల్లి, సత్యవతి, లక్ష్మి, తులసి పాల్గొన్నారు.

# ప్రతి ఓటర్‌ని బిఎల్‌ఓలు కలవాలి : తహసీల్దార్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** జూన్ 24 నుండి ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందించి అట్టి దరఖాస్తును ఎలా పూర్తి చేయాలి దరఖాస్తులో ఏమేమి పొందుపరచాలి అనే విషయం పైన స్పష్టంగా ఓటర్ కు తెలపాలని పెనుబల్లి తహశీల్దార్ వీరభద్ర నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో జరిగిన బిఎల్‌ఓ ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలిపారు. ఇంటికి తాళాలు వేసి ఉన్న బంధువుల ద్వారా మిత్రుల ద్వారా అట్టి సమాచారాన్ని ఇంటి యజమానులకు తెలియజేసే విధంగా ప్రయత్నించాలని ఎటువంటి పరిస్థితుల్లోనైనా ప్రతి ఇంటి యజమానులకు ఓటర్ కు సర్ కార్యక్రమం గురించి తెలియజేయాలని ఆయన సూచించారు. బిఎల్వోలు ఆయా గ్రామాల్లో రాజకీయ పార్టీల ద్వారా నియమించుకున్న బిఎల్‌ఓలను సైతం సంప్రదించి అందరి సహకారంతో జూలై 25 లోపు ఈ కార్యక్రమాల్ని పూర్తి చేయాలని తెలిపారు. బిఎల్‌వో లు ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన అజాగ్రత్తగా వ్యవహరించిన ఓటరు తమ ఓటు హక్కును కోల్పోతారని అందుకు బాధ్యులుగా బిఎల్ వో లే ఉంటారని అన్నారు. ప్రతి దరఖాస్తు ని పూర్తి చేసి ఒక దరఖాస్తు ని బిఎల్వోలు తీసుకొని మరొక దరఖాస్తు ని ఓటర్ కి అందించాలని ఆయన వివరించారు. ఇప్పటికే ఓటర్లకు ఎన్యూమరేషన్ దరఖాస్తులు అందాయని అట్టి దరఖాస్తుకి ఏఏ పత్రాలు అవసరమో ఓటర్ కి తెలియజేసి అట్టి దరఖాస్తులో పొందుపరిచే విధంగా తెలియజేయాలన్నారు.

## రోడ్డు విస్తరణకు మార్కింగ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సంభాని నగర్‌లో రోడ్డు విస్తరణకు కార్పోరేషన్ అధికారులు మార్కింగ్ చేపట్టారు. బుధవారం సంభాని నగర్‌లో మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రతిపాదిత 60 అడుగుల రోడ్డు విస్తరణ కోసం అధికారులు మార్కింగ్ చేపట్టారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన సరిహద్దులను కొలతల ఆధారంగా గుర్తించి మార్కింగ్ నిర్వహించారు. స్థానిక ప్రజలకు మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టనున్న రోడ్డు విస్తరణ వివరాలను వివరించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడుగ్రామంలోని పలు పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరిగాయి. ఇందులో సిపిఎం నేత పేరెల్లి మధు, బిఆర్ఎస్ నేత ఎనిగండ్ల రాంబాబు చేరగా వీరికి మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పార్టీ జెండాను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, మండల నాయకులు చిలివేరు బాబు, గునిగంటి రమేష్, ఉప్పుగండ్ల ప్రసాద్, గునిగంటి సురేష్, కుసుమ రాజ, ఆరెంపుల రామారావు, మహిళా నాయకురాలు గన్నోజు గోవిందరమ్మ, ఆరెంపుల సునీత తదితరులు పాల్గొన్నారు.



## విబిజిరామ్‌జీ రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వి.బి.జి రామ్‌జీ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లి పంచాయతీ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా పంచాయతీల ఎదుట ధర్నాతో పాటు కార్యదర్శులు, సర్పంచ్‌లకు వినతిపత్రాలను ఇవ్వాలని సీఐటీయూ, వ్యవసాయకార్మికసంఘం, రైతుసంఘం ఇచ్చిన పిలుపుమేరకు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సర్పంచ్ ఆరెంపుల మరియమ్మ, కార్యదర్శి రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరసర్పంచ్ సూదగాని విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ పద్మ, పంచాయతీ వర్కర్ మునేష్, ఆశా వర్కర్ లలిత, వార్డు సభ్యుడు ఆరెంపుల ఉప్పలయ్య, మాజీ ఎంపీపీ పగీళ్ల వీరభద్రం, సంఘం మండల నాయకులు సూదగాని యల్లయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.




## టేకులపల్లి మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల పరిధిలోని మోడల్ స్కూల్ లో ఈ నెల 2, 3, 4 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టీవీ రూపస్ ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9, 10 తరగతులు మరియు ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి, సిఇసి లో మిగిలిన సీట్లకు అవకాశం కల్పిస్తామన్నారు. సీట్లు కావలసిన వారు మోడల్ స్కూల్లో టిసి ఇచ్చి అడ్మిషన్ పొందాలన్నారు.

## బుగ్గపాడు ఫుడ్ పార్క్‌పై అవినీతి ఆరోపణలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూసేకరణ, నిధుల వినియోగం, సీతారామ ప్రాజెక్టు మట్టి అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బిజేపి మండల అద్యక్షులు సాలి శివకృష్ణ నేతృత్వంలో బీజేపీ బృందం బుధవారం ఫుడ్ పార్క్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు మాట్లాడుతూ రైతులకు తక్కువ పరిహారం చెల్లించి మిగిలిన నిధులు ఎక్కడ వినియోగించారో వెల్లడించాలని, మట్టి తరలింపుపై పూర్తి వివరాలు బయటపెట్టాలని కోరారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించకుండా ఇతర సంస్థలకు భూములు కేటాయించడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఫుడ్ పార్క్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇప్పటికే పార్టీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి కేంద్రానికి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడగల మధుసూదన్‌రావు, చీకటి వసంతరావు, ఎస్‌కే సుభాని, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయండి

### ప్రజా సంఘాలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు సత్తుపల్లి తహశీల్దార్ పి. సత్యనారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కొత్త చట్టం కార్మికుల హక్కులకు విరుద్ధమని, కేంద్రం నిధుల వాటాను తగ్గించడం, గ్రామపంచాయతీల అధికారాలను పరిమితం చేయడం, ఫోటో ఆధారిత వేతన చెల్లింపులు వంటి నిబంధనలు గ్రామీణ కూలీలకు ఇబ్బందులు కలిగిస్తాయని నాయకులు పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ చట్టాన్ని కూడా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కొత్త విధానాన్ని ఉపసంహరించాలి

ప్రజాపక్షం/దమ్మపేట: జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న వికసిక భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ ఉపాధి హామీ కూలీల జీవనోపాధిని దెబ్బతీస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ విమర్శించారు. దమ్మపేట గ్రామ పంచాయితీ ఎదుట సీఐటీయూ




ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆయన, మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని, కూలీలకు రోజుకు రూ 600వేతనం, ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. విబీజీ రాంజీ విధానాన్ని ఉపసంహరించాలని కోరుతూ సర్పంచ్ పగడాల రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, ఉపాధి కూలీలు మద్ది రావమ్మ, భాగ్యలక్ష్మీ, నాగేశ్వరమ్మ, లక్ష్మీ, మహాలక్ష్మీ, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

ప్రజాపక్షం/దమ్మపేట: మండలంలోని జమీదారు బంజర గ్రామ శివారులో బుధవారం ఉదయం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 11గంటల సమయంలో సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, సుమారు 35 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం గత పది రోజులుగా మతిస్థిమితం సరిగా లేకుండా ఆమె పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై గ్రామ సెక్రటరీ ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పరుచూరి వెంకటకృష్ణరావుకు ఘన నివాళి

ప్రజాపక్షం/దుమ్ముగూడెం: ప్రముఖ దాత, సామాజిక సేవకుడు పరుచూరి వెంకటకృష్ణరావు మృతి పట్ల దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ మాట్లాడుతూ విజయవాడలో నివసించినా దుమ్ముగూడెం మండలంపై ప్రత్యేక అభిమానం చూపిన వెంకటకృష్ణరావు బస్సు షెల్టర్ల నిర్మాణం, అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఒక్కో ఇంటికి రూ 5వేల ఆర్థిక సాయం, పాఠశాలల మరమ్మతులు, పేదలకు పీవీ ట్రస్ట్ ద్వారా వైద్య సహాయం అందించారని గుర్తు చేశారు. మరణానంతరం తన భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు దానం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లంకా శ్రీనివాసరావు, నాయకులు శీరపు అప్పలరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వీరామచనేని వినీల్, మాజీ జెడ్పిటిసి అన్నే సత్యాలు, జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ ఛైర్మన్ కనుబుద్ది దేవా, నటరాజ స్వామి, కెల్లా శేఖర్, కుర్సం మారయ్య, జీరి సత్యనారాయణరెడ్డి, గడ్డం బాలాజీ, సందీప్‌రెడ్డి, బొల్లి శేఖర్, మోతుకూరి శ్రీకాంత్, సమ్మయ్య, వర్మతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాపక్షం/దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐడీఓ ఆస్పత్రి గట్టుమల్ల వైద్య సిబ్బంది విద్యార్థులకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 11 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఐరన్ సిరప్, 11 సంవత్సరాలు పైబడిన విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐడీఓ ఆస్పత్రి సిబ్బంది మాధురి, చందు, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ విజేంద్ర సింగ్, స్టాఫ్ నర్స్ శ్యామల పాల్గొన్నారు.



## విబిజీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాపక్షం/దుమ్ముగూడెం: వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ డిమాండ్ చేశాయి. దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం, రామారావుపేట, అంజుబాక, మహాదేవపురంతో పాటు 15 గ్రామ పంచాయితీల్లో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు రోజుకు రూ 600 వేతనం, ఏడాదికి 200 రోజుల పని, పనిముట్లు, టెంట్లు, తాగునీరు. మెడికల్ కిట్లు, 15 రోజుల్లో కూలీ చెల్లింపు, వారానికోసారి పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కొర్స చిలకమ్మ, రైతు సంఘం మండల కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, సర్పంచ్ సరియం రాజమ్మ, పోడి శ్రీనివాసరావు, మహమ్మద్ బేగు, గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, ఇనుగుర్తి రాజేశ్వరి, మడకం మహేంద్రనాథ్, ఉబ్బా చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరామగిరి పాఠశాలలో మోగని బడిగంట

**-విద్యార్థులు లేక మూతపడిన పాఠశాల**

ప్రజాపక్షం/ఏన్కూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఏన్కూరు మండలం శ్రీరామగిరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మాత్రం విద్యార్థుల లేమితో మూతపడిన పరిస్థితి నెలకొంది. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో ఐదో తరగతిలో కేవలం ఒకే ఒక విద్యార్థి మాత్రమే చదువుతున్నాడు. ఆ విద్యార్థి ఆరవ తరగతికి ప్రమోట్ కావడంతో, పాఠశాలలో విద్యార్థులు లేకుండా పోయారు. దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలను మూసివేసినట్లు సమాచారం. పాఠశాలలో పని చేస్తున్న ఒకే ఒక్క ఉపాధ్యాయురాలిని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో విద్యా వ్యవస్థ పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవుతున్నాయని చెప్పుకుంటున్నా, కొన్ని గ్రామాల్లో విద్యార్థుల లేమితో పాఠశాలలు మూతపడుతున్న వాస్తవం వెలుగులోకి వచ్చింది.




## ఐదేళ్ల తర్వాత మళ్లీ తెరచుకున్న గంగారం తండా ప్రభుత్వ పాఠశాల

**-మండల విద్యాశాఖ అధికారి జయరాజు చొరవ, సర్పంచ్ సహకారంతో పునఃప్రారంభం**

ప్రజాపక్షం/కారేపల్లి: ఐదేళ్లుగా మూతబడిన సింగరేణి మండలంలోని గంగారం తండా ప్రభుత్వ పాఠశాల మళ్లీ విద్యార్థుల కిలకిలారావాలతో సందడి చేసింది. మండల విద్యాశాఖ అధికారి డి జయరాజు ప్రత్యేక చొరవతో, స్థానిక సర్పంచ్ నూనావత్ కిరణ్ కుమార్ సహకారంతో పాఠశాలను సోమవారం పునఃప్రారంభించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి డి జయరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాఠశాలలు మూతపడకుండా, ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ నూనావత్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో పాఠశాల పునఃప్రారంభం సాధ్యమైందని, ఇకపై గంగారం తండా చిన్నారులంతా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించేలా కృషి చేస్తామని చెప్పారు. ఐదేళ్లుగా మూతబడిన పాఠశాల తిరిగి ప్రారంభం కావడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



## అధికారుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదు

**మణుగూరు ఏరియా అధికారుల సంఘం స్పష్టీకరణ**




ప్రజాపక్షం/మణుగూరు: పే అప్‌గ్రేడేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే ను వెంటనే విడుదల చేయాలని, అధికారుల న్యాయమైన హక్కులను పరిరక్షించాలని కోరుతూ మణుగూరు ఏరియా అధికారులు చేపట్టిన నిరసన కార్యక్రమం రోజురోజుకూ మరింత బలోపేతమవుతోంది. బుధవారం ఈ ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. గత రెండు రోజులుగా పలువురు ఉన్నతాధికారులు ఉద్యమానికి సంఘీభావం ప్రకటించడం విశేషం. వారిలో కొందరు స్వచ్ఛందంగా ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనేందుకు ముందుకు రావడం అధికారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇది అధికారుల ఐక్యతకు, ఉద్యమంపై ఉన్న అంకితభావానికి నిదర్శనమని సీఎంఓఏఐ మణుగూరు ఏరియా శాఖ పేర్కొంది. ఆశించిన ఫలితం సాధించే వరకు ఉద్యమాన్ని ఇదే పట్టుదలతో, క్రమశిక్షణతో, శాంతియుతంగా కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. యాజమాన్యం అధికారుల న్యాయమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకుని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు ఏరియా అధికారులందరూ ఇదే ఐక్యతను కొనసాగిస్తూ ఉద్యమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని సీఎంఓఏఐ మణుగూరు ఏరియా శాఖ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మూడో రోజు నిరాహార దీక్షలో శ్రీ గ్రంధి శ్రీనివాస్, శ్రీ ఎం. నర్సింహారావు, మహమ్మద్ ముజాహిద్, పాపారావు, కిరణ్ కుమార్, రామకృష్ణ, సైదులు, వెంకటేశ్వర్లు, నవ్య, కుమారి అంజలి పాల్గొన్నారు. అలాగే పలువురు అధికారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు.

## విబిజీ రాంజీ అనే పతకాన్ని రద్దు చేయాలి

ప్రజాపక్షం/జూలూరుపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వెంగన్నపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ వ్యవసాయ కార్మికులను, పేద రైతులను అన్యాయం చేసే పద్ధతులో పేద రైతులకు వ్యవసాయ పనులు లేని సమయంలో వేసవికాలంలో ఉపాధి ధ్యేయంగా ఆనాటి యూపీఏ వన్ గవర్నమెంట్ వామపక్షాల భాగస్వామ్యంతో కొనసాగుతున్న సందర్భంలో ఆ సందర్భంలో రాసుకొన్న కామన్ మినిమం ప్రోగ్రాం లో భాగంగా ఈ దేశంలో దారిద్రరేఖ దిగువనున్న కూలీలకు పేద రైతులకు వేసవికాలంలో పని లేకుండా నానా అవస్థలు పడుతున్నారని వేసవికాలంలో పని ధ్యేయంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ పేరు మీద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువస్తే గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తన అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ వచ్చింది అన్నారు. కూలీలకు కొర్రీలు పెడుతూ యాంత్రికరణ తీసుకువచ్చి క్రమేనా ఉపాధి హామీ చట్టం నుండి కేంద్ర ప్రభుత్వం పక్కకు తప్పుకునే వివరిస్తుంద న్నారు. అందులో భాగంగానే జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ పేరు నడుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పేరు మారుస్తూ దాని స్థానంలో విబిజి రాంజీ అనే పథకాన్ని తీసుకొచ్చి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పడాలని ఆలోచన చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న బలవంతంగా బిబిజి రాంజీ పథకాన్ని నేటి నుండి భారత ప్రజలపై మోపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది అన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈరోజు దేశవ్యాప్తంగా దేశానికి పట్టుకొమ్మల్లా ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అందులో భాగంగా జూలూరుపాడు మండలంలోని వెంకన్నపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు కూడా ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రెడ్డి బోయిన గోవిందు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాచబంటి కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళల కూలీల మండల కన్వీనర్ పద్దం సుగుణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు తాటి ఇందిర, రైతు సంఘం మండల నాయకులు జల్లిక రాధాకృష్ణ, గార్లపాటి వెంకటి, తాటి పద్మ, బోడ అభి మిత్ర, తంబళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# నేషనల్ హైవే అధికారులకు నిర్లక్ష్యం తగదు

**- రహదారి సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలి**
**- తాత్కాలిక మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలి**
**- రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ**
**- ఎంఎల్ఏ కూనంనేని**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : హై వేల నిర్మాణంలో నేషనల్ హై వే అధికారుల నిర్లక్ష్య దోరణి తగదని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రామవరం గోదుమవాగు బ్రిడ్జిపై తీవ్రంగా ఏర్పడిన పెద్దపెద్ద గుంతలకు తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్న మరమ్మత్తు పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి పనుల తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిడ్జిపై ప్రమాదకరంగా మారిన గుంతల పట్ల నేషనల్ హై వే అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం వెంటనే స్పందించి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాల్సిన నేషనల్ హై వే అథారిటీ పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లే నిత్యం ప్రయాణించే వారికి ఇబ్బందులు, ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి దృష్ట్యా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలికంగా మరమ్మత్తులు చేపడుతున్నారని చెప్పారు. నిలిచిపోయిన రవాణాను వెంటనే పునరుద్ధరించాలన్నారు. నేషనల్ హై వే అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి తమ పరిధిలోని రోడ్డుపై ఉన్న గుంతలను శాశ్వత ప్రాతిపదిక పూడ్చి వాహనదారుల ఇబ్బందులను సమస్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ఇప్పటికే వివిధ పథకాలలో మంజూరైన నిధులతో రోడ్లు, వంతెనలు, అంతర్గత రోడ్లు నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఎంఎల్ఏ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమీషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, నాయకులు భూక్యా శ్రీనివాస్, నగేష్, మున్సిపల్ ఏఇ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సిబ్బంది కొరతతో రైతుల అవస్థలు..!

**-ఆళ్లపల్లి యూనియన్ బ్యాంకులో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి**



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో సిబ్బంది కొరత కారణంగా రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయితీలకు ఒకే బ్యాంకు ఉండటంతో ప్రత్యామ్నాయ సౌకర్యం లేక రైతులు పూర్తిగా ఈ బ్యాంకుపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇతర బ్యాంకులకు వెళ్లాలంటే సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడంతో, రైతులు రుణాలు, బంగారు తాకట్టు, రుణాలు, విత్తనాలు, ఎరువుల కోసం అవసరమైన ఆర్థిక సేవల కోసం ఇదే బ్యాంకును ఆశ్రయిస్తున్నారు. అయితే సిబ్బంది తక్కువగా ఉండటంతో రుణాల మంజూరు ప్రక్రియ నెలల తరబడి ఆలస్యం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతు ప్రైవేట్ దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి బ్యాంకులో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని మండల రైతులు కోరుతున్నారు.




**సిబ్బంది కొరత వాస్తవమే : ఎం మురళీకృష్ణ**

ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది కొరత వాస్తవమేనని, దీని వల్ల రుణాల ప్రక్రియ ఆలస్యమవుతోందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే అదనపు సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

# అభిమానానికి అక్షర రూపం..!

**-వరి నారుతో కేయూఆర్ అని రాసిన పాలేరు రైతు వీడియో**

ప్రజాపక్షం/కూసుమంచి: రాజకీయాల్లో నాయకులపై ప్రజలకు, కార్యకర్తలకు ఉండే అభిమానం వేర్వేరు రూపాల్లో వ్యక్తమవుతుంటుంది. కొందరు బ్యానర్లు కడితే, మరి కొందరు ఊరేగింపులు చేస్తారు. కానీ మట్టిని నమ్ముకున్న ఒక రైతు తన అభిమానాన్ని సరికొత్తగా, ఎంతో సృజనాత్మకంగా చాటుకున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలానికి చెందిన ఒక రైతు, మాజీ ఎంఎల్ఏ కందాల ఉపేందర్‌రెడ్డి(కేయూఆర్)పై తనకున్న అపారమైన అభిమానాన్ని పొలంలోనే ఆవిష్కరించాడు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటూనే, తాను ప్రాణప్రదంగా భావించే నాయకుడి పేరు నిరంతరం స్మరణకు వచ్చేలా వరి నారు మడిలో ప్రత్యేక డిజైన్ చేశాడు. కందాళ ఉపేందర్‌రెడ్డి పేరులోని మొదటి అక్షరాలను కేయూఆర్ వరి నారుతో ఎంతో అందంగా, స్పష్టంగా కనిపించేలా రూపొందించారు. పచ్చని వరి చేల మధ్య ఈ అక్షరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**మట్టిలో పుట్టిన నిష్కల్మషమైన అభిమానం...**

సాధారణంగా రైతులు పొలంలో నారు పోసేటప్పుడు క్రమపద్ధతిలో చల్లుతుంటారు. కానీ ఈ రైతు ఎంతో ఓపికతో సాంకేతిక పరిజ్ఞానంతో ఆలోచించి, అక్షరాల రూపంలో నారు పెరిగేలా ప్రణాళిక చేశాడు. పచ్చటి ప్రకృతి ఒడిలో కేయూఆర్ అనే అక్షరాలు మెరుస్తుండటం చూసి, అటుగా వెళ్లే బాటసారులు, ఇతర రైతులు ఆశ్చర్యపోతున్నారు. సదరు రైతు సృజనాత్మకతను, నాయకుడి పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. ఈ ఆధునిక కాలంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం కంటే, ఇలా మట్టితో ముడిపడిన అభిమానం ఎంతో గొప్పదని, ఇది కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సంపాదించుకున్న స్థానానికి నిదర్శనమని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. పచ్చని నారుతో రాసిన ఈ అక్షరాల చిత్రం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లోనూవైరల్‌గా మారిఅందరినీ ఆకట్టుకుంటోంది.




## డాక్టర్ అఖిల్‌సాయికి ఘన సన్మానం

ప్రజాపక్షం/అశ్వాపురం: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)వైద్యాధికారి డాక్టర్ అఖిల్ సాయిను దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అఖిల్‌సాయి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్స్ షాప్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్లకుంట రాంబాబు, కేవీ రావు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాపక్షం/అశ్వాపురం: వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మల్లెలమడుగు గ్రామ పంచాయిలో సర్పంచ్, పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు దండి రాములు మాట్లాడుతూ రోజువారీ కూలీని రూ 600కు పెంచడం, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడం, రెండు పూటల ఫోటో ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయడం, 15 రోజుల్లో వేతనాలు చెల్లించడం, పే స్లిప్పులు ఇవ్వడం, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయడం, 5 కిలోమీటర్లకు మించి పని ప్రాంతం ఉంటే రవాణా చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు బొమ్మరాతి రామయ్య, బొడ్డు రాములు, గొడుగు వెంకన్న, స్వర్గం వీరరాఘవులు, ఉపాధి హామీ కూలీలు పిండిపోలు నిర్మల, రెడ్డిరాజుల స్పందన, కోక రమణ, ఆకుల అంజమ్మ, పాణ్యం జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎంఎల్ఏ తాటి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/చంద్రుగొండ: అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ తాటి వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రధాన సెంటర్‌లో కేక్‌ను కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండే నాయకుడికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు నరుకుళ్ల సత్యనారాయణ, సూర వెంకటేశ్వర్లు, చిన్నం రామకృష్ణ, భూపతి శ్రీనివాసరావు, గాదె లింగయ్య, నరుకుల్ల వాసు, చీదెళ్ల పవన్‌కుమార్, సత్తి నాగేశ్వరరావు, సంకా కృపాకర్, ఇర్పా స్రవంతి, బాలునాయక్, బానోత్ రనియా, కళ్లెం వెంకటేశ్వర్లు, అనుమోలు హనుమంతరావు, ఇస్లావత్ వీరన్న, సుంకర రామారావు, ఓరుగంటి రాములు, మార్తి సత్యనారాయణ, అప్పాజీ, అబ్బాస్ అలీ, వంకాయలపాటి బాబురావు, నడిపి కృష్ణ, అంచ కృష్ణ, సమ్మయ్య, కుంచపు కన్నయ్య పాల్గొన్నారు.



## డాక్టర్ రాముకు ఘన సన్మానం

ప్రజాపక్షం/చంద్రుగొండ: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాము చేత కేక్ కట్ చేయించి, పూల బొకే అందజేసి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. రోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు చూపుతున్న అంకితభావం ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ రాము మాట్లాడుతూ తనకు అందించిన గౌరవానికి ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇదే నిబద్ధతతో పని చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఎస్సీ కార్పొరేషన్ లోన్లు అన్ని ఎస్సీ కులాలకు వర్తింపజేయాలి

ప్రజాపక్షం/ఏన్కూరు: ఎస్సీ కార్పొరేషన్ లోన్లు ఎస్సీ వర్గంలోని అన్ని కులాలకు న్యాయంగా వర్తింపజేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగల నరేష్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సూపరింటెండెంట్ రమణకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ లోన్ మంజూరులో ఏ ఒక్క సామాజిక వర్గానికి మాత్రమే లబ్ది చేకూరకుండా, రిజర్వేషన్ ప్రకారం అన్ని ఎస్సీ ఉప కులాలకు సమాన అవకాశాలు కల్పించాలని, అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపిక చేయాలని కోరారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన స్టేట్ ఎలక్షన్ కమీషన్ అడిషనల్ సీఈఓ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రాష్ట్రంలో ఓటర్ల జాబితాను పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించడానికి చేపట్టిన సమగ్ర ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర ఎన్నికల కమీషన్ అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వరరెడ్డి మండల పరిదిలోని తనికెళ్లలో పరిశీలించారు. గ్రామంలో పర్యటించి బిఎల్ఓ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఫారం ఎలా నింపుతున్నారు, మీకు తెలియకపోతే బిఎల్ఓ అర్థమయ్యేటట్లు చెపుతున్నారాలేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఉద్యోగులు కాని ఇతర ప్రదేశాల్లో ప్రయివేటు ఉద్యోగం కోసం వలస వెళ్లి అక్కడ కూడా ఓటు నమోదు అయి ఉంటే ఎక్కడయినా ఒకే చోట ఓటు ఉండే విధంగా చూసుకోవాలని రెండో చోట కూడా ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఒక్కచోటే ఓటు హక్కును ఉండే విధంగా చూసుకొని రెండో ఓటు ఉన్న చోట తొలగించుకునేందుకు ఓటరు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని లేకుంటే ఇబ్బందులు పడతారని తెలిపారు. ఫారం పూర్తి చేసిన తర్వాత ఓటరు సంతకం తప్పకుండా చేయాలని అన్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో బిఎల్ఓలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఇర్ఓ పి శ్రీజ, తనికెళ్ల సర్పంచ్ గడల కళావతి, కొణిజర్ల తహశీల్దార్ ఎన్ అరుణకుమారి, ఆర్ఐలు నరేష్, సురేష్, బిఎల్ఓ సూపర్వైజర్ సిహెచ్ రమేష్, బిఎల్ఓ బి రామచందర్రావు, పంచాయతీ కార్యదర్శి బి రవికుమార్, గ్రామస్థులు గడల భాస్కర్రావు, యాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో బిఎల్ఏలు పాల్గొనాలి



**-బిఎల్వోలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలి**
**-రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్ఏ)లు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దివాకర టిఏస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో రానున్న 15 రోజులు కీలకమని ప్రక్రియ విజయవంతానికి సహకరించాలన్నారు. ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి వాటిని పూరించిన పిదప తిరిగి స్వీకరించి ఆన్లైన్లో నమోదు చేసే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఈ దశలో బూత్ లెవల్ ఏజెంట్లు ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి బూత్ స్థాయి అధికారులకు అందజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 95.78 శాతం పూర్తయినట్లు, డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) క్రియాశీలకంగా ఉండి వివరాల సేకరణలో సహకరించాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేరు లేకపోయినా తప్పనిసరిగా అభ్యంతరం నమోదు చేయాలని అభ్యంతరం నమోదు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్డిసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విపత్తులు ఎదుర్కోవడానికి ముందస్తు ప్రణాళికలు



**-ఎన్డిఆర్ఎఫ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విపత్తులను ఎదుర్కోవడానికి ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విపత్తుల నిర్వహణ, ముందస్తు సన్నద్ధత చర్యలపై ఎన్డిఆర్ఎఫ్ (జాతీయ విపత్తు స్పందన దళం) అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన సహాయక చర్యలకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు, సహాయక బృందాల మోహరింపు, పడవలు, లైఫ్ జాకెట్లు, అత్యవసర సామగ్రి అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా తక్షణమే స్పందించేలా ఎన్డిఆర్ఎఫ్ బృందాలు, జిల్లా యంత్రాంగం, పోలీస్ , అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత వరదల అనుభవంతో అధికారులు పకడ్బందీ కార్యాచరణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎన్డిఆర్ఎఫ్కు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, కలెక్టరేట్ ఓఎస్డీ వెంకటేశ్వర్లు, స్టేషన్ ఫైర్ అధికారి రామిరెడ్డి, ఎన్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ బిటన్ సింగ్, కానిస్టేబుల్స్, సందీప్ రెడ్డి, ఆంజనేయులు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర దొంగను పట్టుకున్న ఖమ్మం పోలీసులు

**- బంగారు ఆభరణాలు స్వాధీనం**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** తాళాలు వేసిఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను ఖమ్మం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టౌన్ ఏసిపి కార్యాలయంలో బుధవారం టౌన్, సిసిఎస్ ఏసిపిలు ఎస్వి రమణమూర్తి, సర్వర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కంబంపాటి ఏసోబు అలియాస్ కందుల సురేష్ సెంట్రింగ్ పనులు చేస్తూ జివిస్తున్నాడు. వచ్చే ఆదాయం సరిపోక దొంగతనాలకు తెరలేపాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తిరుగుతూ తాళం వేసిఉన్న ఇళ్లను గుర్తించి రాత్రిసమయంలో చోరీలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు సైతం వెళ్లాడని ఏసిపి రమణమూర్తి తెలిపారు. అతనిపై రెండురాష్ట్రాల్లో కలిపి 22 దొంగతనాల కేసులు ఉన్నట్లు చెప్పారు. ఖమ్మం నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు, ఖానాపురం హవేలీ పోలీసుస్టేషన్ పరిధిలో మూడు, వెంసూరు పరిధిలో ఒకటి, విఎం బంజర్లో ఒకటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో ఒకటి, తిరువూరు పోలీస్స్టేషన్ పరిధిలో ఒకటి చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. మంగవారం ఖమ్మం కిన్నేర హోటల్ ఎదురుగా పెట్రోల్ బంక్ వద్ద టూటౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీచేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున నిందితుడు ఏసోబును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల విషయం బయటపడినట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి 32 లక్షల రూపాయల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వన్టౌన్, టూటౌన్, ఖానాపురం హవేలి సిఐలు కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాశ్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పోలీసు కమిషనర్ సునిల్దత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా నగరంలోని డాక్టర్ బిఆర్ అంబెద్కర్ మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థినులతో కలిసి సిపి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. అంతేకాకుండా వాటికి నీరుపోసి సంరిక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యవరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, చెట్ల అవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల అవరణలు, ఖాళీప్రదేశాలు, వీధుల వెంట, రోడ్లుకు ఇరువైపుల మొక్కలు నాటాలన్నారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపి వెంట టౌన్ ఏసిపి ఎస్వి రమణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం రాజ్యలక్ష్మి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కనకవల్లి, సిఐలు కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాశ్ ఉన్నారు.

## ఉపాధిహామీని యథావిధిగా కొనసాగించాలని వినతి



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని మండల పరిధిలోని కమలాపురంలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్పంచి, ఉపసర్పంచులకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు విరమించుకోవాలని, పాత పద్ధతిలోనే ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ, వ్యవసాయ కార్మికసంఘం డివిజన్ సభ్యులు మరికంటి వెంకన్న, సీపీఎం కమలాపురం గ్రామ శాఖ కార్యదర్శి కుక్కల కుటుంబరావు, వ్యవసాయ కార్మిక సంఘం ముదిగొండ మండల కమిటీ సభ్యులు బొజ్జ వెంకట్, బొజ్జ పెదబాబు, గురజాల ఏసోబు, గంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని గనియ తండా గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో 30వ తేదీ మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి గుడిలో ఉన్న హుండీలోని రూ. 32,000 నగదు, ఆంజనేయస్వామి 20 గ్రాముల బరువు గల వెండి కళ్ళు దొంగిలించటం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ బానోత్ రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రమాదంలో పంచాయతీ కార్మికుని మృతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన చాదిరాసు పల్లి పుల్లయ్య (45) పంచాయతీ కార్మికుడు ఖమ్మంలోని సీఎం సభ కార్యక్రమానికి ఏర్పాట్లకు సహకరించేందుకు అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు ఖమ్మం వెళ్లారు. అయితే సభ వాయిదా పడటంతో తిరుగు ప్రయాణంలో ఆదివారం సాయంత్రం మర్లపాడు రహదారిలో రాత్రి కాల సమయంలో గేద అడ్డు వచ్చి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయ పడిన అతనిని స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. బుధవారం వైద్యం పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని మృతి వార్త విన్న గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో మరణించడం వార్త విన్న గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయాన్ని తెలుసుకున్న పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్మికులు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపాన్ని సానుభూతిని తెలుపుతూ ఓదార్పునిచ్చారు.

## ఘనంగా ప్రపంచ వ్యవసాయ దినోత్సవం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల కేంద్రంలో ప్రపంచ వ్యవసాయ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక సమన్వయకర్త మందడి ఇజ్రాయిల్ రైతులను ఘనంగా సన్మానించారు. పిన్న వయస్సు నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కుంటూ వ్యవసాయాన్నే నమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తూ గ్రామంలో కష్టపడే రైతుగా మంచి గుర్తింపు పొందిన నిరుపేద రైతు బచ్చలకూరి రాములును ఘనంగా సన్మానించి మాట్లాడారు. తనలాంటి సాధారణ రైతును గుర్తించి సన్మానించడంతో ఆనందంగా ఉందని, గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మందుల వెంకన్న, వల్లోజు వెంకటేశ్వర్లు, వల్లపు కోటయ్య, ఏలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా బోడా వీరు నాయక్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు నియోజకవర్గం కూసుమంచి ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సర్పంచ్ల సంఘం సమావేశంలో మండల సర్పంచ్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోరు వీరు నాయక్, ఉపాధ్యక్షులుగా కొండా కృష్ణవేణి, వడిత్య వెంకటేష్నాయక్, ప్రధాన కార్యదర్శిగా మల్లెల స్వాతి, కోశాధికారిగా నీలకంఠ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు బోడా వీరు నాయక్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్రెడ్డి, ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల గడ్డగా మారుతున్న సింగరేణి అడ్డా



- జేఏసీ ఆధ్వర్యంలో హెడ్ ఆఫీస్ ముట్టడి విజయవంతం
- కార్మికుల సహనాన్ని బలహీనతగా భావిస్తే పరిణామాలు తప్పవు
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి గడ్డ కొత్తగూడెం కార్మికుల పోరాటాల అడ్డాగా మారుతోంది. గత కొంతకాలంగా సింగరేణిలో నెలకొన్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కార్మికులు పోరుబాటపట్టారు. ఇందులో భాగంగా బుధవారం కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించగా, ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల నుండి వేలాదిమంది కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు తరలివచ్చి ఉద్యమానికి తమవంతు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు చేసిన నినాదాలతో హెడ్ ఆఫీస్ ప్రాంతం మార్మోగింది. హాజరైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కార్మికుల సహనాన్ని యాజమాన్యం, ప్రభుత్వాలు బలహీనతగా భావిస్తే పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సంపదను సృష్టిస్తున్న కార్మికులకు రావాల్సిన న్యాయమైన హక్కులను కేంద్రప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కాలరాస్తున్నాయని విమర్శించారు. 12వ వేతన సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని, నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పట్టించుకోకుంటే దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఏఐటియూసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమిరాజ్ కుమార్, జనక్ ప్రసాద్, మంద నర్సింహారావు, కృష్ణ ప్రసాద్‌లు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల శ్రమతో సంస్థ కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తోందని, అయినప్పటికీ కార్మికుల హక్కులను నిరాకరించడం బాధాకరమన్నారు. 12వ వేజ్ బోర్డు ఏర్పాటులో కొనసాగుతున్న జాప్యాన్ని వెంటనే మానుకోవాలని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే పనులను ఊరుకోబోమని, అవసరమైతే ఉద్యమాలు, నిరసనలు, ముట్టడి ద్వారా యాజమాన్యాం, ప్రభుత్వం దిగొచ్చేలా చేస్తామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల నెరవేరేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే సారయ్య, వీరభద్రయ్య, వంగా వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు మల్లికార్జున్, రమణమూర్తి, నజీర్, మేకల ఈశ్వర్, సుధాకర్, గట్టయ్య, ఐఎన్‌టియూసి నాయకులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, లక్ష్మారెడ్డి, ఆల్బర్ట్, పీతంబరం, రజాక్, సిఐటియూ నాయకులు రాజిరెడ్డి, విజయగిరి శ్రీనివాస హెచ్ఎంఎస్ నాయకులు ఆంజనేయులు, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి ఎల్ఓసీ అందజేత



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలానికి చెందిన మొహమ్మద్ ఫర్జానా బేగం వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ 5.20లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)ను పినపాక నియోజకవర్గ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు బుధవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. పేద ప్రజలు వైద్య ఖర్చుల కారణంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. అనంతరం ఫర్జానా బేగం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఒరుగంటి బిక్షమయ్య, నాయకులు బేతం రామకృష్ణ, గాదె కేశవరెడ్డి, ఊస అనిల్, తూము పెద్ద రాఘవులు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, బురెడ్డి వెంకటరెడ్డి, సుంచు ఏకాంబరం, బారాసు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం రైతు, కూలీ వ్యతిరేక విధానాలకు నిరసన



ప్రజాపక్షం/పినపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పినపాక మండలంలోని గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించి సెక్రటరీలకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ 600 కనీస వేతనం అమలు చేయాలని, పని దినాలను పెంచి పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయానికి ఎరువుల సబ్సిడీలు పునరుద్ధరించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్, మడివి రమేష్, ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, ఏఐకేఎస్ నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ గంజాయి స్మగ్లింగ్ గుట్టు రట్టు

-సారపాక వద్ద రూ 2.90 కోట్ల గంజాయి పట్టివేత
-కంటైనర్ లారీలో రహస్య గడి ఏర్పాటు చేసి స్మగ్లింగ్
-ముగ్గురు అరెస్ట్, వివరాలు వెల్లడించిన పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు భారీ ఎత్తున గంజాయిని అక్రమంగా తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఈ భారీ స్మగ్లింగ్ గుట్టు రట్టు అయింది. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 30వ తేదీ రాత్రి అనుమానాస్పదంగా ఉన్న కంటైనర్ లారీని తనిఖీ చేయగా, లారీలో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో దాచిన 581 కిలోల గంజాయి లభించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ 2,90,58,000గా ఉంటుందని అంచనా వేశారు. ఈ ముఠా స్మగ్లింగ్‌ను పర్యవేక్షించేందుకు ఎస్కార్ట్‌గా వచ్చిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సహదేవ్, సురేష్ కుమార్, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలానికి చెందిన దొగ్గి త్రినాథ్ ఉన్నారు. వీరి నుంచి గంజాయి, కంటైనర్ లారీ, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ముఠాలో మరికొందరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సభ్యులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్ఐ మేడ ప్రసాద్, అదనపు ఎస్ఐ నాగభిక్షం, కానిస్టేబుల్ సురేష్ నాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల 12వ వేతన కమిటీ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/ఇల్లందు: బొగ్గు గనుల 12వ వేతన కమిటీ ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్మిక సంఘాల(జేఏసీ)ఆధ్వర్యంలో గనుల్లో డిమాండ్స్ డే నిరసనలు నిర్వహించారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీకేఓసీ, కేఓసీ, సివిల్, వర్క్‌షాప్, జీఎం ఆఫీస్, ఎస్అండ్‌పీసీ, ఏరియా ఆసుపత్రి, ఏరియా స్టోర్స్‌లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం జీఎం కార్యాలయంలో స్థానిక జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు ఎండి నజీర్ అహ్మద్, ఎల్ మధుకర్, ఎస్ ఎ నబీ, బాల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మిక హక్కులు బలహీనపడతాయని, ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని, కాంట్రాక్ట్ విధానం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, జయరాజ్ సురేష్, నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కలవల సిద్ధార్థ్, లచ్చిరామ్, జక్కుల శ్రీనివాస్, యుగేందర్, ఐఎన్టీయూసీ నాయకులు యాదగిరి, జమీల్, బాషు, నాగమల్లు, అన్వర్, రాములు, విజయ్, సీఐటీయూ నాయకులు అబ్బాస్, కార్మికులు ఆపర్ణ, మౌనిక, సత్యవతి, సింధు, తేజావతి, మేరుబాయి, తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి మండలంలో సర్ ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/కూసుమంచి:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ డిప్యూటీ సీఈవో వాసం వెంకటేశ్వరరెడ్డి జుజ్జులరావుపేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 209, 210లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్ల పనితీరును సమీక్షించి, ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాలంటూ తగు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఈఆర్వో జి సదానందం, ఎలక్షన్ డిప్యూటీ తుమ్మ రవీందర్, తహసీల్దార్ డి సైదులు, గిర్దవార్ జి జ్యోతి, బిఎల్వోలు రవిశంకర్, నాగమణి పాల్గొన్నారు.

# రంగాపురం-మణుగూరు బస్సులో నరకయాతన





180 మందితో కిక్కిరిసి, టైమ్‌కు రాని బస్సు

ప్రజాపక్షం/కరగూడెం: కరగూడెం మండల ప్రజలు, గిరిజన ప్రాంత వాసులు రంగాపురం నుండి మణుగూరు వెళ్లే టీఎస్ ఆర్‌టిసి బస్సులో తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. 52 సీట్ల కెపాసిటీ ఉన్న ఆర్డినరీ బస్సులో దాదాపు 180 మంది ప్రయాణికులు కిక్కిరిసిపోయి నిలబడేందుకు కూడా స్థలం లేకుండా అవస్థలు పడుతున్నారు. కరగూడెం మండలంలోని రంగాపురం, కరకగూడెం, పినపాక, బయ్యారం సహా చాలా గిరిజన గ్రామాలకు మణుగూరు వెళ్లడానికి ఇదొక్కటే బస్సు సౌకర్యం. ఉదయం 10:00 గంటలకు రంగాపురం నుండి బయలుదేరాల్సిన బస్సు 10:30 అయినా రావడం లేదు. మణుగూరు చేరేసరికి మధ్యాహ్నం 12:00 నుండి 12:30 అవుతోంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. బస్సు లోపల మహిళలు, విద్యార్థులు ఒకరిపై ఒకరు పడుతూ, రాడ్లు పట్టుకొని వేలాడుతున్నారు. కాలు పెట్టడానికి కూడా చోటు లేదు. గిరిజన మహిళలు పిల్లలతో సహా గంటల తరబడి నిలబడి వెళ్తున్నారు. 10 గంటల బస్సు 10:30కి వస్తుంది. పినపాక కాలేజీకి 11:30కి చేరుతాం. ఫస్ట్ క్లాస్ మిస్ అవుతున్నాం అని ఇంటర్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరగూడెం మండల గిరిజన ప్రాంత ప్రజల కోసం తక్షణమే రంగాపురం మణుగూరు రూట్‌లో ఉదయం 11:00 గంటలకు అదనపు బస్సు నడపాలని, ఉన్న బస్సును సకాలంలో 10:00 గంటలకు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఐటిడిఏ పీఓ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గిరిజన ప్రాంత సమస్యను పరిష్కరించాలని, లేకపోతే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని గ్రామ ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం టేకులపల్లి : ఒకవైపు భయం, మరో వైపు మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన టేకులపల్లి మండలంలో చోటుచేసుకుంది. బోడు పోలీసుల, గ్రామస్తుల కథనం ప్రకారం, బోడు గ్రామ పంచాయితీ సర్పంచ్ పొదెం స్వరూప అత్తగారు పొదెం చుక్కమ్మ బుధవారం మొక్కంపాడు గ్రామ సమీపంలో ఓ పత్తి చేలో కూలి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో చేనుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఫెన్సింగ్ దాటే క్రమంలో ఆ తీగ తగిలి తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి చేరుకుంది. వెంటనే తోటి కూలీలు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె చనిపోయింది. అయితే మాడె పాపయ్య చేనులో వేసిన విద్యుత్ ఫెన్సింగ్ తగలడం మూలంగా చుక్కమ్మ చనిపోవడం జరిగింది. దాంతో తనపైన పోలీసు కేసు నమోదు అవుతుందేమోననే భయంతో తీవ్ర మనస్తాపం చెందిన పాపయ్య గురువారం చేలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా పాపయ్య ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

